క్లుప్తంగా

ఆర్టీసీ బస్‌పాసుల సేవలకు అంతరాయం

చీరాల అర్బన్: ఏపీఎస్‌ఆర్టీసీ జారీ చేసే స్టూడెంట్, అన్ని రకాల బస్‌పాసులకు సంబంధించిన సేవలను ఈనెల 5,6 తేదీల్లో నిలిపివేస్తున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌పాసులకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ చేస్తున్న సందర్భంగా రెండు రోజులు పాటు సేవలు నిలిపివేసినట్లు తెలిపారు. 7వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాసులు జారీ చేస్తామన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు గమనించాలన్నారు.

కారు, బైకుఢీ-వ్యక్తికి గాయాలు

అద్దంకి రూరల్: ముందు వెళ్తున్న బైకును కారు ఢీకొట్టిన ఘటన గురువారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకి నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై ఉన్న శింగరకొండ నుంచి అద్దంకికి వ్యక్తి బైకు మీద వస్తున్నాడు. ఈ క్రమంలో అదే రోడ్డులో హైదరాబాద్ నుంచి వస్తున్న కారు అద్దంకి సమీపంలోని శాంతి పెట్రోలు బంకు వద్దకు రాగానే బైకును ఢీకొట్టింది. బైకు మీదనున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది.

23 మద్యం దుకాణాలకు దరఖాస్తులు

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గంలో 23 మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఈనెల 9వతేది సాయంత్రం 5 గంటల వరకు అందజేయవచ్చని ఎక్సైజ్ సీఐ ఎ. భవాని గురువారం తెలిపారు. అద్దంకి పట్టణంలో 5, రూరల్‌లో 2, బల్లికురవ మండలంలో 4, సంతమాగులూరు మండలంలో 5, కొరిశపాడు మండలంలో 4, జే.పంగులూరు మండలంలో 3 షాపులకు ఏర్పాటుకు అనుమతి లభించిందన్నారు. ఈనెల 11 తేదీన కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసీ షాపులను కేటాయిస్తారన్నారు. 12వ తేదీ నుంచి షాపులు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.

6న విద్యార్థులకు చేతిరాత పోటీలు

అద్దంకి రూరల్: విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించటంతో అద్దంకి శాఖ గ్రంథాలయంలో చేతిరాత పోటీలు 6వ తేదీన నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ సుగుణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీలకు ఎటువంటి ఫీజు లేదని, ఆరుగురిని విజేతలుగా ఎంపికచేసి బహుమతులు అందజేస్తామని ప్రకటనలో వివరించారు.

స్నేహితుడి చదువుకు సాయం



చీరాల: స్నేహితుడి చదువుకు తోటి విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. 'లెట్స్ హెల్ప్' చీరాల ఆధ్వర్యంలో దాతలు, తోటి విద్యార్థుల సహకారంతో సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న పోతురాజుకు రూ.30 వేలు సాయం అందించారు. సంస్థ ప్రతినిధి కనపర్తి కిరణ్ కుమార్ చేతుల మీదగా అందించారు. కళాశాలలో సీఎస్‌ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న పోతురాజు తండ్రి ఇటీవల చనిపోవడంతో చదువు మధ్యలో ఆపేశాడు. కుటుంబ పోషణ నిమిత్తం కూలికి వెళ్తున్నాడు. చదువులో ముందుండే పోతురాజు చదువు అర్థాంతరంగా ఆపడం గుర్తించిన లెట్స్ హెల్ప్ సంస్థ పోతురాజు పడుతున్న ఇబ్బందులను ముందుకు తీసుకువచ్చింది. ఎస్‌బీఐ మేనేజర్ చింతలపూడి కరుణాకర్ స్పందించి రూ.10 వేలు అందించగా, విద్యార్థులందరూ రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హర్షిణి, సువర్ణ, విద్యార్థులు దినేష్, మాధవి, లక్ష్మీప్రియ, సుగుణ, సాత్విక పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

చినగంజాం: ప్రజా ప్రతినిధులు రాజకీయాలపై కాకుండా పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలని కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. కొత్తపాలెం పంచాయతీ ఆవరణలో గురువారం గ్రామ కార్యదర్శి ఎం బాబురావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో పంచాయతీలోని అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. 2024–25వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి, పంచాయతీలోని అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పనులు మంజూరు, నిధుల కేటాయింపు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన తదితర అంశాలపై గ్రామ సభలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంబాబు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మా.. చల్లగా దీవించమ్మా!



జాగర్లమూడిలో ఉజ్జయినీ మహంకాళిగా అమ్మవారు



చినగంజాంలో లలితాంబ ఆలయంలో అమ్మవారు



మేదరమెట్ల మిద్దెల డొంకరోడ్డులో బాలాత్రిపురసుందరిదేవిగా.



అద్దంకిలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బాలా త్రిపురసుందరిదేవిగా అమ్మవారు



వేటపాలెం రామన్నపేట రామాలయంలో బతుకమ్మలు

- వైభవంగా ప్రారంభమైన దసరా నవరాత్రోత్సవాలు
- 1116 కలశాలతో చీరాల పట్టణంలో కలశయాత్ర
- బాలా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు



అమ్మవారి నగరోత్సవంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల అర్బన్/వేటపాలెం: హిందువులకు ముఖ్యమైన పండుగల్లో దసరా పండుగ ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు దసరా నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనిమిచ్చింది. ఈసందర్భంగా దసరా శరన్నవరాత్రులను గురువారం చీరాల పట్టణంలో ఘనంగా ప్రారంభించారు. స్థానిక సంతబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటంతో పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. సంతబజారులోని దేవాలయం నుంచి 1116 మంది మహిళలు కలశాలతో పట్టణంలో కలశాయాత్రను నిర్వహించారు. ఈకలశోత్సవంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు స్వీకరించారు. ఆలయ ప్రెసిడెంట్ గుంటూరు మాధవరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బెస్తపాలెంలోని సాయిబాబా మందిరంలో, లక్ష్మీ భవన సమాజంలో, పేరాల, చీరాల శివాలయంలో, పాపరాజుతోటలోని కామాక్షి సోమేశ్వరాలయంలో దసరా పూజలు నిర్వహించారు.

✦ వేటపాలెంలోని స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోగల రాజ్యలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయాన్నే సుప్రభాత సేవ నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో రాత్రి నిర్వహించిన వనితా నీకు వందనం సాంఘిక నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆలయ అధ్యక్షుడు ముత్తుకుమరన్ ఇంటి నుంచి అమ్మవారి బంగారు ఆభరణాలు ఆలయాని ఊరేగింపుగా తరలివచ్చారు.

సందడి చేసిన చిన్నారులు..

అద్దంకి/అద్దంకి రూరల్/జే.పంగులూరు/బల్లికురవ/మేదరమెట్ల: దసరా పండుగ సందర్భంగా చిన్నారులు సందడి చేశారు. బాలాత్రిపురసుందరిదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. చరిత్ర కలిగిన పంగులూరు భీమలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో స్వామి వారికి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ఖడ్గమాలార్చన నిర్వహించారు.

✦ అద్దంకి పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం, స్థానిక భవాని సెంటర్‌లోని వింధ్యావాసిని సమేత నగరేశ్వరస్వామి (వేయిస్తంభాల) దేవస్థానాల్లో ఉదయం మహిళా భక్తులు గుండ్లకమ్మ నది నుంచి 101 కళశాలతో నీరు తీసుకువచ్చి అమ్మవారి అభిషేకం చేపట్టారు.

✦ బల్లికురవ మండలం చెన్నుపల్లి గంగా పార్వతీ సమేత పరుశువేదీశ్వర స్వామి ఆలయం, కొండాయపాలెంగంగా పార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయం. కొణిదెన భవాని సమేత శంకర స్వామి ఆలయంలో అమ్మవార్లను అర్చకులు బాలా త్రిపుర సుందరిదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు.

✦ కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల మిద్దెల డొంకరోడ్డులో కొలువైయున్న కనకదుర్గ మల్లీశ్వరస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఈనెల 12వ తేదీ వరకు అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయాలకు పోటెత్తిన మహిళలు..

చినగంజాం/యద్దనపూడి/మార్టూరు/కారంచేడు: దసరా పండుగ సందర్భంగా పలు ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. పర్చూరు మండలం నూతలపాడులోని మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వణుకూరి ప్రభాకరరెడ్డి, శ్రీలక్ష్మి,వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, పద్మావతి, పోలూరి అంజిరెడ్డి, పోలమ్మ పాల్గొన్నారు.

✦ ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఇంకొల్లులో వాసవీ కన్యకాపరమేశ్వరీ మందిరంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

✦ చినగంజాంలోని మండలంలోని లలితాపరమేశ్వరీ సమేత రామకోటేశ్వరాలయంలో వేంచేసి ఉన్న లలితాంబ అమ్మవారి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

✦ విజయవాడ కనకదుర్గమ్మను పోలిన కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా ఆలయ దర్మకర్తల ఇంటి నుంచి అమ్మవారి నగలను వైభవంగా ఊరేగింపు నిర్వహించారు.

✦ యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో అమ్మవారు, పూనూరు త్రిపుర సుందరి సమేత త్రిపురాంతకస్వామి ఆలయం, శ్రీరామకష్ణ ధ్యాన మందిరంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

✦ మార్టూరులోని స్థానిక బొ్ర్రాయి సెంటర్‌లో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు గుడివాడ సుబ్రహ్మణ్యం దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలు, గాజులు తదితర సామగ్రి పంపిణీ చేశారు.

తాగుదాం.. తాగి ఊగుదాం

- నూతన పాలసీతో మద్యం వ్యాపారుల ఉత్కంఠ
- వందల సంఖ్యలో దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధం
- పర్చూరు నియోజకవర్గంలో 22 మద్యం షాపులు

పర్చూరు (చినగంజాం): తమ్ముళ్లు రూ.99కే నాణ్యమైన మద్యం అందిస్తాం.. హాయిగా తాగండి అంటూ ఎన్నికల ముందు చెప్పిన మాటలకు చంద్రబాబు తు.చ తప్పకుండా పాటించాడు. గత ప్రభుత్వంలో పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తే, కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం అందిస్తోంది. ఈమాటలు వింటున్న ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక గ్రామాల్లో మద్యం ఏరులై పారడం ఖాయంగా కనిపిస్తోందని ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నూతన మద్యం పాలసీని మంగళవారం విడుదల చేసింది. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం విన్నూత్నంగా చేపట్టిన ప్రభుత్వ మద్యం షాపుల విధానానికి స్వస్తి పలికి ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఈ నెల 12వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం షాపుల నిర్వాహణను తేనున్నారు. ఇందు కోసం ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం రూ.2 లక్షలు దరఖాస్తు ఫీజుగా నిర్ణయించింది.

జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులు కేటాయింపు..

10 వేల మంది లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్సు ఫీజు రూ.50 లక్షలు చెల్లించాలి.10 వేలు దాటి 50 వేల మంది వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేలకు పైబడి 5 లక్షలు వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలు లైసెన్స్ ఫీజుగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పర్చూరు నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాల్లోను 50 వేల మందికి లోపు జనాభా కలిగి ఉండగా రూ.50 లక్షల శ్లాబు లోపు నియోజకవర్గంలో ఎక్కువ గ్రామాలు కన్పిస్తున్నాయి. దరఖాస్తుల స్వీకరణను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో చేపట్టనున్నారు. అంతే కాకుండా షాపుల కేటాయింపుకు లాటరీ పద్ధతి అవలంభించనుండగా ఈనెల 11 వతేదీ జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి షాపులను కేటాయించే విధంగా నోటిఫికేషన్ విడుదలయ్యింది.

నియోజకవర్గ పరిధిలో 22 షాపులకు దరఖాస్తులు..

పర్చూరు నియోజకవర్గ పరిధిలో 6 మండలాల్లో 22 మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. పర్చూరు మండలంలో మొత్తం 4 షాపులు కాగా పర్చూరులో 2, చెరుకూరు, నూతలపాడుల్లో ఒక్కొక్కటి ఉన్నాయి. చినగంజాం మండలంలో మొత్తం 4 షాపులు, చినగంజాం గ్రామంలో 2 షాపులు, పెదగంజాం, కడవకుదురు గ్రామాల్లో ఒక్కొక్కటి ఉన్నాయి. మార్టూరు మండలంలో మొత్తం 6 షాపులు కాగా మార్టూరు 3, జొన్నతాళి 1, బొల్లాపల్లి 1, ద్రోణాదుల 1, కారంచేడు మండలంలో మొత్తం 3 షాపులు కాగా కారంచేడు, స్వర్ణ, కుంకల మర్రు గ్రామాల్లో ఒక్కొక్కటి ఉన్నాయి. యద్దనపూడి మండలంలో 2 మొత్తం షాపులు కాగా యద్దనపూడి 1, అనంతవరం 1 షాపులు ఉన్నాయి. ఇంకొల్లు మండలంలో మొత్తం 3 షాపులు కాగా ఇంకొల్లులో 2 షాపులు, పూసపాడు గ్రామంలో 1 షాపుకు దరఖాస్తులు స్వీకరణ ఉండనున్నట్లు అధికారులు తెలిపారు.

మద్యం సిండికేట్‌లకు సిద్ధమవుతున్న నిర్వాహకులు

పూర్తిగా లాటరీ విధానంలో మద్యం షాపులు కేటాయించనున్న నేపథ్యంలో సిండికేట్ విధానానికి షాపుల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. లాటరీ విధానంలో షాపులు కేవలం అదృష్టంమీద ఆధారపడి ఉండటంతో ఉత్సాహవంతులైన మద్యం వ్యాపారులు నిరాశ పడాల్సిన పరిస్థితిలో సిండికేట్ విధానం కలిసొచ్చే అవకాశం ఉంది. ఇందు కోసం మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు అధిక సంఖ్యలో చేయనున్నారు. ఆయా గ్రామాలలో మద్యం షాపు నిర్వాహణలో వచ్చే ఆదాయాన్ని బట్టి ఒక్కొక్క షాపునకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకునేందుకు వ్యాపారులు సిద్ధపడుతున్నారు.

పార్టీ కోసం కష్టపడి పనిచేయాలి

- వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలకు కరణం వెంకటేష్ పిలుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: ఆత్మవిశ్వాసంతో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం వేటపాలెం మండలంలోని పార్టీ ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడారు. ఓటమి చెందిన తర్వాత కొందరు మౌనంగా ఉండడం సరికాదన్నారు. ఎన్నికలలో పార్టీ ఓటమి పాలైందని నిరాశ చెందవద్దన్నారు. పార్టీలోని ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాను కొందరు ప్రచారం చేస్తున్నట్లు ఏ పార్టీకో, మరో ప్రాంతానికి వెళ్తున్నట్లు దుష్ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. తాను వైఎస్సార్‌ సీపీలోనే ఉంటానని, చీరాల నుంచే పోటీ చేస్తానని, ప్రతిఒక్కరికి అండగా ఉంటానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో వైఎస్సార్‌ సీపీ సత్తా చాటాలన్నారు. వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు చూశారని, ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అందుకే వైఎస్సార్‌ సీపీని అందరం కలిసి బలోపేతం చేద్దామన్నారు. కార్యక్రమంలో వేటపాలెం మండలంలోని వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



సాయం అందిస్తున్న మదర్ సొసైటీ ప్రతినిధులు

కారంచేడు: వరద బాధిత కుటుంబాలకు యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ అండగా నిలచింది. సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మున్నంగి నాగిరెడ్డి, యర్రం సీతారామిరెడ్డిలు గురువారం విజయవాడ జక్కంపూడి కాలనీ వాసులకు అండగా నిలిచారు. 110 కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 కేజీల బియ్యంతో పాటు, మహిళలకు ఒక చీర, యువతులకు పంజాబీ డ్రస్‌లు, పురుషులకు దుస్తులు, చిన్నపిల్లలకు బిస్కట్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక సహకార భారతి అధ్యక్షుడు అట్టూరి శ్రీనివాసరావు, మహిళా మండల అధ్యక్షురాలు టీ జానకీదేవి, ఆరాధ్య మహిళా వెల్ఫేర్ అధ్యక్షులు విజయలక్ష్మి, నళిని పాల్గొన్నారు.

లింగ సమానత్వంపై అవగాహన అవసరం



సమీక్ష సమావేశంలో సూచనలందిస్తున్న చీరాల ఆర్డీవో

చీరాల టౌన్: ఆడ, మగ తేడాల లేకుండా లింగ సమానత్వంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ లెవల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆడ, మగ లింగ భేదం లేకుండా ఇద్దరిని సమానంగా చూడాలన్నారు. సమాజంలో జరుగతున్న ప్రతి అంశాలను పిల్లలకు తెలియజేసి చైతన్యవంతులుగా చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా కమిటీ సభ్యులు చూడాలని, భ్రూణ హత్యలు జరగకుండా, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. కమిటీ సభ్యులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, ఎన్జీవోలు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈసమావేశానికి ఆర్డీవోతో పాటుగా పోలీస్, రెవెన్యూ, వైద్యులు, ఎన్జీవోలు, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చీరాల డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్, డీఐవో వెంకటేశ్వర్లు, ఎన్జీవోలు వైద్యులు డాక్టర్ యాకోబు, డాక్టర్ షణ్ముఖశ్రీ, డాక్టర్ విజయ్‌కుమార్, ఐ.సుభాషిణి, ఒన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు సాయం



ఎమ్మెల్యేకు నగదు అందిస్తున్న యాజమాన్యం

చీరాల: ప్రియదర్శిని విద్యోదయ స్కూల్ విద్యార్థులు అందరూ కలిసి సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1 లక్షను గురువారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. విద్యార్థులలో ఇలాంటి ఉదాత్తమైన విలువలును పెంపొందించడం పట్ల స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఎం.మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు

చీరాల రూరల్: మట్టినమూనా పరిక్షల ఆధారంగా రైతులు తమ పొలాల్లో ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెం, విజయనగర్ కాలనీల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో వరినాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులకు తగిన సూచనలు, సలహాలను అందించి మాట్లాడారు. వరిపైరులో పచ్చిరొట్ట వాడకం వాటిని పొలంలో కలియదున్నటం, జింక్‌దాతు లోప నివారణ, మట్టి నమూనాలు సేకరించి పరిక్షలకు పంపించి వాటి ఫలితాల అనంతరం ఎరువులు వాడాలని సూచించారు. అలానే కాంప్లెక్స్ ఎరువుల యాజమాన్యం, నాణ్యమైన విత్తనాలు ఎంపిక, చీడపీడల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పశువైద్యుడు ఎస్. చిట్టిబాబు వివిధ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో ఐ. సుమతి, పశువైద్యాధికారి డాక్టర్ పావని, మాజీ జెడ్పీటీసీ జి. చంద్రమౌళి, గుర్రం వెంకటేశ్వర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అధికారులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అనూష

ఇంకొల్లు (చినగంజాం): సీజనల్ వ్యాధులు పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బండారు అనూష అన్నారు. ఇంకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ భవన్‌లో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని ఆయా శాఖల అభివృద్ధి పనులు, నిర్వహించబోయే అభివృద్ధి పనులు గురించి సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో శానిటేషన్‌పై శ్రద్ధ తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా పంచాయతీలు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జీ శ్రీనివాసరావు సూచించారు. విద్యాశాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో ఎంపీపీ మాట్లాడుతూ నాడు- నేడులో భాగంగా స్టాలిన్ పేట పాఠశాలలో పనులు మధ్యలో నిలిచిపోయాయని వాటిని వెంటనే పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పాముకాటు మందు యాంటీ వీనం అందుబాటులోకి తీసుకొని రావాలని ఆమె వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన రాంబాబు



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎస్సీసెల్ అధ్యక్షుడు రాంబాబు

యద్దనపూడి: వైఎస్సార్‌ సీపీ పర్చూరు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు గురువారం సాయత్రం తాడేపల్లిలోని పార్టీకేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, మాజీ మంత్రి బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జునను కలిశారు. ఈనేపథ్యంలో తమపై అక్రమంగా రౌడీషీట్ ఓపెన్ చేశారని అలాగే నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడటమే కాక అక్రమ కేసులు బనాయిస్తున్నారని జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.

8న మండల సమావేశం

బల్లికురవ: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 8 మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండల స్థాయిలో శాఖల వారీగా సమీక్షిస్తానన్నారు. సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు పాల్గొని విధిగా సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

89 మందికి వైద్య పరీక్షలు

కారంచేడు: వాతావరణ మార్పులతో సీజనల్‌గా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు, ఆయా ప్రాంతాల వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడు ఎస్టీ కాలనీ (యానాది కాలనీ)లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని సూచనలు అందించారు. మొత్తం 89 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, జ్యోతిరాణి, జయశ్రీ, జగదీశ్వరి, మేరీనిర్మల, రాణి, భవానీ, హసీనా, వైద్య సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.